క్లుప్తంగా

## డ్వాక్రా సంఘాలకు దసరా కానుక

ఎల్కతుర్తి : మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు దసరా కానుకగా అందిస్తున్న రివాల్వింగ్ ఫండ్ గ్రాండ్ భీమదేవరపల్లి భరతమాత మండల సమాఖ్యకు విడుదలైనట్లు ఏపీఎం వేణు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముల్కనూర్, కొత్తకొండ, రత్నగిరి గ్రామాల్లో 2025 సంవత్సరంలో నూతనంగా ఏర్పాడిన 3 మహిళా సంఘాలకు రూ.15వేల చొప్పున రూ.45వేల ఫండ్ విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థికసాయం మహిళల ఆర్థిక బలోపేతానికి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచడానికి తోడ్పడుతుందన్నారు. దసరా పండుగ సందర్భంగా ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## దేవాలయ అభివృద్ధి పనులకు సుముఖత

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం నందు దాతలు పర్ష సర్వేశ్వర్ దేవాలయ ఆవరణలో రూ.30 లక్షలతో నూతనంగా ఎల్లమ్మ దేవాలయం నిర్మించగా సోమవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ మేరకు దేవాలయం చుట్టూ రూ.2 లక్షలతో ఐరన్ గ్రిల్స్, అన్నదానసత్రం, కాటేజీ నిర్మాణం, త్రిశూలస్నానం కోసం కోనేరు నిర్మాణం చేసేందుకు దాతలు సర్వేశ్వర్ యాదవ్ కుటుంబ సభ్యులు సుముఖత వ్యక్తం చేశారు. పనులకు కావాల్సిన ప్లాన్స్, ఎస్టిమేట్స్‌ను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా వేయిస్తామని ఆలయ ఈఓ కందుల సుధాకర్‌తో దాతలు తెలిపారు. వారివెంట ఆలయ చైర్మన్ కమ్మగాని ప్రభాకర్‌గౌడ్, ఉప ప్రధాన అర్చులు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

ఆత్మకూరు: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో తనియ విన్నపం, డోలారోహణం, సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


## 'చల్లా' ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న రమేశ్

ఆత్మకూరు : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్‌లో చేరకుంటేనే సొసైటీ పాలకవర్గాలను రద్దు చేయించారని అనడం హాస్యాస్పదమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలను మరిచి స్వలాభం కోసమే పని చేశారన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభివృద్ధిని ఓర్వలేక ధర్మారెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, పరికిరాల వాసు, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవిందర్‌గౌడ్, కంచ రవికుమార్, రాజు, రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ కోసం ఒక మొక్క



నడికూడ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పులిగిల్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తల్లులతో కలిసి తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీ విద్యార్థి తమ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 21న సంఘం ఆవిర్భావ వేడుకలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : ఈ నెల 21న వరంగల్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మాంకాల యాదగిరి అన్నారు. సోమవారం పరకాల అమరధామంలో సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంబయ్య, పైడి, వెంకటస్వామి, సునీల్, మొగిళి పాల్గొన్నారు.

# నిలిచిన సబ్‌సెంటర్ నిర్మాణ పనులు

- మూడేళ్ల క్రితం నిర్మించి వదిలేశారు
- ఇరుకైన గదిలో నిర్వహణ
- ఇబ్బందుల్లో రోగులు



ముళ్ల పొదల్లో శిలాఫలకం



సబ్‌సెంటర్ నడుస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ గది

ఆత్మకూరు : మండల కేంద్రంలో సబ్‌సెంటర్ నిర్మాణం పిల్లర్ల వరకే నిర్మించి వదిలేశారు. మూడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించి వదిలేశారు. ఇప్పటి వరకు నిర్మాణం ఊసెత్తడం లేదు. ఇరుకైన గదిలో సబ్‌సెంటర్ నడుస్తుండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022లో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రూ.20 లక్షల నిధులతో సబ్‌సెంటర్ నిర్మాణాన్ని ప్రారంభించారు. పోచమ్మ సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చేసి ఆ స్థలంలో సబ్‌సెంటర్ నిర్మాణం మొదలు పెట్టారు. గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న ఓ అద్దెఇంట్లో సబ్‌సెంటర్‌ను నిర్వహిస్తుండగా కొంతకాలం క్రితం గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ గదిలోకి మార్చారు. ఇరుకైన ఈ గదిలో సబ్‌సెంటర్ నిర్వహణ సిబ్బందికి కత్తిమీద సాములాగా మారింది. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పని చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో అంతా అస్తవ్యస్తంగా మారింది. ప్రతీ బుధవారం సబ్‌సెంటర్‌లో గర్భిణీలకు, బాలింతలకు వైద్యపరీక్షలతో పాటు చిన్నపిల్లలకు వ్యాక్సిన్ వేస్తారు. గది ఇరుకుగా ఉండడంతో రోగులకు, స్త్రీలకు, చిన్నపిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. గది బయట రోడ్డు మీదనే వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటున్నది. సబ్‌సెంటర్ నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని అప్పటి వరకు సబ్‌సెంటర్ ను పక్కా ప్రైవేటు భవనంలోకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

## నిబంధనలు పాటించని నిర్మాణాలపై చర్యలు

- మున్సిపల్ కమిషనర్ సుష్మ



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు

పరకాల: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. వెల్లంపల్లి రోడ్డు, ఆదర్శనగర్‌లో కాల్వలను ఆక్రమించుకొని నిర్మించిన నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుష్మ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని నిర్మాణాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కూల్చివేయడం జరుగుతుందని తెలిపారు. కూల్చివేతలలో టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేషి, ఉద్యోగులు వెంకట్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



ఎల్కతుర్తి: మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

ఎల్కతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను అసత్య ప్రచారంతో అబద్దాలతో విష ప్రచారం చేస్తున్న ఆ పోరాటానికి సంబంధం లేని వ్యక్తులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పోరాట చరిత్రను హిందూ, ముస్లింల మధ్య యుద్ధంలాగా కొట్లాటగా జరిగినట్లు విష ప్రచారం చేస్తూ అబద్దాలతో నిరంతరం పేపర్లు, మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం స్వేచ్ఛావాయులను ప్రజలకు అందించాలని పోరాటంలో లక్షలాది మంది పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, నాయకులు రవి, తిరుమల, మొండయ్య, మల్లయ్య, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, చంద్రమౌళి, కుమారస్వామి పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని మాందారిపేటలో సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మండలంలోని మాందారిపేటలో నిర్వహించిన వారోత్సవాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు 4000 మంది తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు స్టాలిన్, మండల కార్యదర్శి సదానందం, సహాయ కార్యదర్శి అశోక్, ఎండీ అంకూషావలీ, రమేష్, సాంబయ్య, కల్పన, రమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై కళాజాతా



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో సోమవారం డ్రగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతల నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వరంగల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో జరుగుతున్న మోసాలపై కళాజాత బృందం తమ ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు వివరించి చైతన్యపరిచారు. గంజాయి, గుట్కా డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని వివరించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని చదువుపై ఏకాగ్రత సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలలకు పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



శాయంపేట : గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన కాపీని చూపిస్తున్న మైలారం గ్రామస్తులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో బుచ్చిరెడ్డి భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, గడిపె విజయ్ కుమార్ మాట్లాడుతూ మైలారంలోని దళితుల వ్యవసాయ భూమిని, శ్మశాన వాటికలోని కొంత భూమి కబ్జా చేశారని, హుస్సేన్‌పల్లి నుంచి మైలారం వరకు ఉన్న పెద్ద చెరువు కట్టలో కొంత భూమిని తన వ్యవసాయ భూమిలో కలుపుకున్నాడని తెలిపారు. దళితులకు చెందిన భూమిని కొనుగోలు చేసి ఆ భూమి కాకుండా మిగిలిన భూమిని అక్రమంగా కబ్జా చేశాడని అన్నారు. సాగుభూమి పక్కనే ఉన్న పిల్లకాల్వను సైతం ఆక్రమించాడని మండిపడ్డారు. అధికారులు స్పందించి బుచ్చిరెడ్డి ఆక్రమించుకున్న భూములపై సర్వే చేయించి హద్దులు కేటాయించి బుచ్చిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, సాంబరెడ్డి, కిరణ్ ఉన్నారు.

### అక్రమ పట్టా రద్దు చేయండి

కమలాపూర్ : మండలంలోని అంబాల శివారులోని వివిధ సర్వే నంబర్లలోని 15 మంది నిరుపేద దళితులకు చెందిన ఉమ్మడి వారసత్వ వ్యవసాయ భూమిని ఆర్‌ఓఆర్ ద్వారా ఒక్కడే అక్రమంగా పట్టా చేసుకున్నాడని, అక్రమ పట్టాను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని అంబాలకు చెందిన జేరిపోతుల రమేశ్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అంబాలకు చెందిన దివంగత జేరిపోతుల కనుకయ్య, దివంగత బాలపోచయ్య, దివంగత మంకయ్య ముగ్గురు అన్నదమ్ములకు గ్రామశివారులోని సర్వే నంబరు 339/15/1లో 1.20 ఎకరాలు, 467/ఎ/3లో 12 గుంటలు, 467/బి/2లో 24 గుంటలు, 470/ఎ/2లో 1 గుంట చొప్పున మొత్తం 2.17 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని బాలపోచయ్య కుమారుడు కొంరయ్య (సింగరేణి విశ్రాంత ఉద్యోగి) తప్పుడు ధృవ పత్రాలతో ఆర్‌ఓఆర్ చేసుకొని పట్టాదారు పాస్‌పుస్తకం పొంది సుమారు 15 మందికి అన్యాయం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ భూమి 1970 నుంచి తమ వారసుల పేరిట పహాణీలో నమోదై ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని రమేశ్ ఫిర్యాదులో కలెక్టర్‌ను కోరారు.

## చెట్టును కాపాడేందుకు చర్యలు

- నేలకు ఒరిగిన చెట్టును పరిశీలించిన ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



నేలకు ఒరిగిన చెట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జున దేవాలయ సమీపంలో దాదాపు 100 ఏళ్ల చరిత్ర కలిగిన శివాల మర్రి చెట్టు ఇటీవల నేల ఒరిగిపోవడంతో ఈ విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నెనీ రవీందర్‌రావుతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో చెట్టును పరిశీలించారు. చెట్టును రక్షించేందుకు అటవీ, దేవాదాయ శాఖ, పర్యావరణ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల విశ్వాసాలకు అనుసంధానమైన ఈ వృక్షాన్ని కాపాడడం మనందరి బాధ్యతని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ధర్మకర్తలు, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో మాదక ద్రవ్యాల వినియోగంపై సీఐ శ్యాంసుందర్ అవగాహన కల్పించారు. గ్రామంలో పింగిళి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు సోమవారం వలంటీర్లు యాంటీ డ్రగ్ అవేర్నెస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ద్వారా పిల్లలను బాల కార్మికులుగా, భిక్షగాళ్లుగా మారుస్తున్నారని అన్నారు. అక్రమ రవాణా ద్వారా అమ్మాయిలను మాయమాటలతో లేదా బలవంతంగా వ్యభిచారం, లైంగిక బానిసత్వం వంటి వాటికి గురి చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్నప్పుడు టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం అధికారి కవిత, రామా రత్నమాల, డాక్టర్ వి మమత, హెచ్‌ఎం శ్రీనివాస్ రావు, ఎస్సై సుధాకర్, ఏఎస్ఐ భాగ్యలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు



పత్తిపాక శివారులో స్తంభాలకు అల్లుకున్న తీగలు

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామ శివారులో, పత్తిపాక శివారులో, పలు గ్రామాల్లో, పంట పొలాల పక్కన విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు పారి ప్రమాదకరంగా మారాయి. వర్షాలతో చెట్ల తీగల నుంచి పంట పొలాలకు వెళ్లే రైతులకు తీగల ద్వారా విద్యుత్ షాక్ తగిలి చనిపోయే ప్రమాదం ఉంది. అధికారులు చొరవ తీసుకొని మండలంలోని స్తంభాలకు పారిన చెట్ల తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## సేవా పక్వాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంరెడ్డి

దామెర : సేవా పక్వాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో సోమవారం మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు వివరిస్తూ, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు గన్ను సతీష్, ముఖేష్, ఈశ్వరమ్మ, నాగేందర్, రమేష్, సుమంత్, కార్తీక్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లు పెంచే వరకు పోరాటం చేస్తాం



పరకాల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు

పింఛన్లు పెంచే వరకు పోరాటం చేస్తామని వక్తలు అన్నారు. జిల్లాలో సోమవారం పింఛన్లు పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పింఛన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ, బీజేపీ, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరు: తహసీల్దార్ కార్యాలయ ముట్టడిలో నాయకులు



ఎల్కతుర్తిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు



దామెర: తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్



నడికూడ : తహసీల్దార్ రాణికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఐనవోలు : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్పీ నాయకులు



శాయంపేట : తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేత



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత, గాయకుడు, తెలుగు భాషోపాధ్యాయుడు జక్కు కృష్ణమూర్తిగౌడ్ లయన్స్ ఇంటర్నేషనల్ వారిచే ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాడు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన గురువుకు వందనం కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, తెలుగు సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, హరిహరన్ లయన్స్ క్లబ్ ఆఫ్ మేజిస్టిక్ ఉపాధ్యక్షులు గట్టు వేణు గౌడ్, బండి కిరణ్‌గౌడ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల్లో విజ్ఞాన తృష్ణను పెంపొందిస్తూ మూఢనమ్మకాల నిర్మూలనకు పాటు పడటమే కాకుండా విద్యార్థులను సృజనాకారులుగా తీర్చిదిద్దుతున్నందుకు పలువురిని ఘనంగా సత్కరించి ప్రశంసపత్రం అందజేశారు.

## ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రకాశ్



ప్రకాశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఉపేందర్

ధర్మసాగర్: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బరిగెల ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం నియామక పత్రాన్ని అందించి మాట్లాడుతూ.. సంఘం బలోపేతంలో భాగంగా అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు పూర్తి స్థాయిలో నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ అభయహస్తం ద్వారా రూ.12 లక్షలు దళితులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించిన ఉపేందర్ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.